# జీవితపు ఆఖరి సోపానాలు

**శ్రీ చిప్పకుల వెంకటసుబ్బయ్య**

"ఇస్, అబ్బ" అంటూ మంచంమీద కూలబడ్డాడు రామారావు అప్పుడే బడినుంచి వచ్చి పైపంచదీసి మంచం తల వైపు పడేస్తూ.

"ఏమండీ! ఏమైంది." అని అడిగింది వంటింట్లో పిల్లాడికి అన్నం పెడుతున్న శాంత.

"ఆ! ఏముంది కావడానికి. కేవ్, కేవ్ మని చంటాడు ఆవిధంగా ఏడుస్తూంటే వాడికి పాలు పొయ్యక ఏమైంది, ఏమైంది అంటే ఏముంది కావడానికి. పాత పాటేగా! ఈరోజు గూడ రాలేదు" అని ప్రొద్దుగూకులు బడిలో పిల్లలతో తలపగుల గొట్టుకొచ్చిన రామారావు ఇంటివద్ద గూడ ఇదే పీడేనా అని మనస్సులో అనుకొంటూ కేక లేశాడు.

ఈరోజు పాలులేవండీ! ఇప్పుడే పాల మనిషి వచ్చి ఎన్నిరోజులమ్మా! ఆగే ఉండేది. ఇప్పటికి రెండు నెలలయినా డబ్బు ఇవ్వకపోతే ఎట్లాగని పాలు పోయకుండా పోయిందండీ!" అని గద్గదస్వరంతో సమాధానం ఇచ్చింది భర్త మనస్సులోని ఆవేదనను తెలుసుకున్న శాంత పిల్లవాడిని చేతిలోకి తీసుకొంటూ.

"అయితే, ఈపూట కాఫీ లేవుగా-కాసిని మంచినీళ్లయినా తగలెయ్యి." అన్నాడు తన చంటి పిల్లాడికి పాలు సంపాదించలేని తన జీవితాన్ని గురించి విచారపడుతూ.

"ఇదిగో. త్రాగండి" అన్నది శాంత మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

భార్య చేతిలోనున్న పాపనుచూచి "ఏం, బాబూ" నీకు పాలుగూడ తేలేక పోతిని గదా అని బాధపడుతూన్న మనస్సుతో మంచినీళ్ళు కూడా త్రాగలేక పోయాడు రామారావు.

"పిల్లవాడు చేతిలో నిలవడంలేదు. మరెక్కడయినా కాసిని తీసుకొనివస్తారా" అన్న భార్యమాటలు విని "నాలుగు సంవత్సరాలనుంచి పనిచేస్తున్న ఈ గ్రామంలో కాసిని పాలు తీసుకొని రాలేకపోతానా?" అని తన మనస్సును ధైర్యపరచుకొని గడప దాటి బజార్లో పడ్డాడు.

కొంతదూరం తలవంచుకొని నడుస్తూ ఎవరిని అడుగుదామా అని ఆలోచిస్తున్న రామారావుకు "ఏమండోయి, మాష్టరు గారూ!" అన్న కేక వినబడేసరికి ప్రక్కకు తిరిగిచూచాడు. తనతో ఈ నాలుగు సంవత్సరాలనుంచి ఒక్కసారైనా ఒక్క మాట మాట్లాడని పేరయ్య ఎడమచేతితో బొర్ర నిమురుకుంటూ కుడిచేత్తో నోట్లోని చుట్టను పోర్లిస్తూ తన మేడ వాకిట్లో నిల్చొని ఈయనను ఆహ్వానిస్తూన్నట్లుగా అదో రకంగా చూస్తున్నట్లు కనబడ్డాడు. "ఊర్లోకల్లా కొంచెం పెద్దమనిషి కదా" అనుకుంటూ మేడలోకి పోయాడు రామారావు.

"ఏమండి, ఎక్కడిదాకా." అని చుట్ట దమ్ములాగి గాలిలోనికి పొగవదుల్తూ అడిగాడు పేరయ్య.

"ఆ, ఇక్కడికే కొంచెం పనుండి పోతున్నాను" అని అన్నాడు రామారావు లేనటువంటి చిరునవ్వు నొకదానిని తెచ్చిపెట్టుకొని.

"ఏం చెప్పకూడదా ఏమిటి?" అన్నాడు పేరయ్య ఒక విషపునవ్వు నవ్వుతూ.

"ఏమిలేదండి, డబ్బులకు కొంచెం ఆలస్యమయిందని పాలమనిషి పాలు పొయ్యలేదట ఎక్కడన్నా కాసిని పాలు తెస్తామని పోతున్నాను." అన్నాడు రామారావు.

"పాలకోసం ఎక్కడికో ఎందుకయ్యా మా యింట్లో అడిగితే కాసిని ఇవ్వక పోయామా" అంటూ పేరయ్య తమ ఇంట్లో పనిచేసే సుబ్బడిని పిల్చి "ఒరేయ్, మాష్టరు గారికి చెంబుతో పాలు తెచ్చియ్యి" అని హుకుం జారీచేశాడు.

"కొంచెం ఆలస్యమువుతుంది దొరగారూ" అంటూ లోనికి పొయ్యాడు సుబ్బడు.

"నా...తో... ఏ...దో... ప...ని వచ్చిందే మీకు?" అని అన్నాడు రామారావు పిల్చిన పని ఏమిటో తెల్సుకుందామని.

"ఆ, ఏమిలేదు నీవు ఈ ఊరువచ్చి ఎన్నాళ్ళయిందో తెలుసుకుందామని?" అన్నాడు పేరయ్య.

"నాలుగు సంవత్సరాలండీ" అన్నాడు రామారావు తనకు ఏమైనా ట్రాన్సుఫరు తెప్పిస్తాడేమోనని భయపడుతూ.

"అయితే మా వూరివాడిక్రింద లెక్కేనన్నమాట."

"ఏ ఊరయితే ఏమిలెండి జీవితం గడవడానికి. మాబోటి వాండ్లకు ఒక ఊరు ఒక పల్లె అని ఏముంది. పైవారికి దయ వచ్చి నట్లల్లా మారుస్తుంటే అక్కడికల్లా మేము మా పిల్లలు పిల్లికూనల్లాగ తిరుగుతుంటాము." అని "మీరు పిల్చిన పని చెప్పారుగాదు?" అన్నాడు రామారావు.

"ఏమి లేదు. నీకు తెలిసే ఉంటుందనుకొంటాను వచ్చే నెలలో పంచాయతీబోర్డు ఎన్నికలు గదూ. దానికి నేను ప్రెసిడెంటుగా నిల్చుందామనుకొన్నాను. కనుక మీరందరు సహాయం చేయాలి."

"మీబోటి వాండ్లకు మాబోటి పొట్ట గడవనివాండ్లం ఏమి సహాయం చేస్తామండి" అన్నాడు రామారావు పేరయ్య ఓట్లు వెయ్యమని అడుగుతున్నాడని మనస్సులో అనుకొని.

"పేద గొప్ప అని వ్యత్యాసం ఏముందండి. బ్రహ్మ అందరినీ ఒకేరకంగా సృష్టిం

(53-వ పేజీ చూడండి)

# ★ జీవితపు ఆఖరిసోపానాలు ★

(11-వ పేజీ తరువాయి)

కాడు. నీటి అలల్లాగ డబ్బు వస్తూ ఉంటుంది. పోతూ ఉంటుంది. పోయ్యేటప్పుడు వెంటబెట్టుకొని పోతామా. బ్రతికిన నాల్గురోజులు అందరికీ మంచివాడనిపించుకొని పోవలెగాని ఈ డబ్బువలన లాభమేముందండి" అని వేదాంతమార్గములో పడ్డవాడిలాగ పై పాటనంతా వల్లించివేశాడు పేరయ్య.

ఇతను చేస్తున్న పనులకూ చెప్తున్న మాటలకు మధ్య ఎంత భేదం ఉందో రామారావు తెలుసుకోలేకపోయాడు. ఆ మాటలు వింటున్నంతసేపూ తన శరీరంమీద పాములు, జెర్రులు పారాడుతున్నట్లుగా బాధపడ్డాడు. తాను అనుకొన్న ఉద్దేశ్యము ఆయన నోటిమీదగుండానే చెప్పిస్తామనుకొని

"నన్నేం సహాయం చేయమంటారు?" అని అడిగాడు రామారావు.

"మీ ఇంట్లోని రెండు ఓట్లు నాకే వచ్చేట్లుగా......" అన్నాడు పేరయ్య.

"క్షమించండి" నన్ను ఇంతకుపూర్వమే లింగయ్యగారు అడిగారు. సరేనని వాగ్దానం చేశాను. కనుక......

"ఆ చేస్తే ఏమిలెండి."

"నా మనస్సు ఒప్పుకోదండి" కనుక ఏమి అనుకోవద్దు అని నిక్కచ్చిగా చెప్పేశాడు.

అందుకు పేరయ్య ప్రళయకాలరుద్రుడిలాగ "నీవు సత్యసంధుడివైతే మేము కాకపోయ్యామా?" అంటూ ఎగిరిపడ్డాడు.

అక్కడ ఇంకొక క్షణమయినా కూర్చోవడానికి మనసొప్పని రామారావు "వెళ్ళివస్తానండి" అని చెప్పి బయటపడ్డాడు.

ఈ అనవసర ప్రసంగంలో కాలము వ్యర్థ పుచ్చితినని మనస్సులో బాధపడుచూ అందరూ నిద్రపోవుటచే ఎక్కడను పాలు కొరకక భారమయిన మనస్సుతో కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు.

ఇంటివద్ద పిల్లాడు పాలకొరకు ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. శాంత మాత్రం అప్పుడే ఊరినుంచి వచ్చిన కొడుకుతో మాట్లాడుతూంది. రామారావు ఇంటికివచ్చి కుమారుని చూచి "ఏరా! గోపి. ఇవ్వాళ వచ్చావ్? వంట్లో కులాసాగా లేదా? శెలవులప్పుడే ఇచ్చారా? బడి చాలించుకొని ఎందుకు వచ్చావు?" అని సారు గారి డిస్ట్రిక్టుబోర్డు హైస్కూలులో చదువుచు ఇంటికి వచ్చిన గోపిమీద ప్రశ్నలవర్షం కురిపించాడు.

"కాదు, నాన్నా జీతం కట్టడానికి డబ్బు పంపమని ఎన్ని జాబులు వ్రాసినా పంపకపోతేను నా పేరు ఇవ్వాళ బడిలోనుంచి కొట్టివేశారు. కనుక తీసుకొనిపోయి లేటు ఫీజుతో కూడ కడదామని వచ్చాను అన్నాడు.

ఆ మాటలు వినడంతోనే రామారావు మొదలునరకిన తరువువలె మంచంమీద కూలబడ్డాడు.

"ఏమండీ, ఇందాక ఇంకా జీతాలు రాలేదని చెప్పినారుగదా. పిల్లలు కట్టే జీతాలు వసూలు చేసే పన్నులు ఇవన్ని జిల్లాబోర్డువారు ఏమి చేస్తున్నారండి" అని ప్రపంచ పరిస్థితి తెలియని అమాయకపు శాంత తన భర్తను అడిగింది.

భార్య అమాయకత్వానికి రామారావు నవ్వుకొని "పిచ్చిదానా, వచ్చే ఆదాయాన్ని సక్రమమైన మార్గంలో ఎప్పుడు ఖర్చు పెడతారో అప్పుడుబాగుగా సరిపోతుంది. అలా చేయని నాడే చాలకపోవడం లోటు కనిపించడం జీతాలుఇస్తాం ఇస్తాం అంటూ మనబోటి వాండ్ల జీవితాలను పీల్చడం జరుగుతుంది. మిమ్మల్లను అందరిని సుఖపెడతామని చెప్పి అమాయకపు ప్రజలవద్దనుంచి ఓట్లు తీసుకొని పెద్దలై గద్దె లెక్కి అధికారం స్వీకరించి వీడు గొప్ప వీడు పేద అనే భేదంలేకుండా పేద ప్రజలను పీల్చి పిప్పిచేసి పన్నులు వసూలు చేసి, వారి బిడ్డలకు చదువు చెప్పతామని జీతముల ద్వారా డబ్బు గుంజుతూ అట్లా సకాలములో కట్టలేని మనబోటి దరిద్రుల పిల్లలను బడినుంచి తొలగిస్తూ వసూలు చేసిన డబ్బంతా ఎవరికి దొరికినమటుకు వారు దిగమ్రింగి వారి క్రిందనే గొంతు చించుకొంటూ పనిచేస్తున్న నాబోటి వారికి పనిచేసిన 3 నెలలకు గూడ జీతములివ్వకుండా డబ్బు లేదని చేతులు తిరగవేస్తున్నారు. అట్లా దిగమింగుతుంటే డబ్బు ఎక్కడనుంచి వస్తుంది." అని రామారావు తన కంఠశోషను అంతటిని తన భార్యముందు వెలిబుచ్చి ఆ హృదయ వేదనతోనే నిద్రించాడు.

మరునాడు ప్రొద్దున తన పెండ్లి సమయంలో అత్తగారు ఇచ్చిన 40 రూ॥ల వెలగల వెండిగ్లాసు అవసరానికి రూ 10 లకు తెగనమ్మి కుమారునికి ఇచ్చి ఊరికిపంపాడు. ఇట్లాగే ఇంట్లోని సామాన్లు ఒకొక్కక్కటి మార్వాడి ఇంటి ముఖం పడుతున్నాయి.

రామారావు కరువు పక్షిలాగ నోరు తెరచుకొని జీతం కొరకు ప్రతిరోజు పోస్టు ఆఫీసు చుట్టు తిరుగుచు ప్రతిరోజు పస్తులు మాడుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. గంటలు రోజులు, నెలలు గడచిపోతున్నై. కాని పైవారికి దయరాదు, దయావస్తేగాని జీతాలు రావు. జీతాలు వస్తేగాని జీవితాలు గడవవు.

గ్రామంలో ఎన్నికలు పూర్తి అయినై. ఫలితాలు తెలిసినై. కాని పేరయ్యమాత్రం ఓడిపోయాడు. తాను ఓడిపోవడానికి స్కూలుమాష్టరు గూడా కొంతకారణం అనుకొన్న పేరయ్య తన పలుకుబడినంతయూ ధారబోసి రామారావును అక్కడనుంచి సుమారు 100 మైళ్ళ దూరములోనున్న గ్రామానికి మార్పించాడు.

రామారావు స్కూలుకు పోగానే ఆస్కూలు హెడ్మాస్టరు పిడుగులాంటి వార్త తెచ్చిన ఆయన ట్రాన్సఫరు కాగితం



# ★ జీవితపు ఆఖరిసోపానాలు ★

చేతికిచ్చాడు. మరునాడేపోయి జాయిన్ కావలెనని ఉంది. రామారావు గుండె నీరైపోయింది. వంటి మీద కారుతూన్న చెమటతో చినిగిన చొక్కా అంతా తడిసిపోయింది. ఇది పేరయ్య చేసిన పని అనుకున్నాడు. న్యాయానికి కాలం గాదని మనస్సుకు నచ్చచెప్పాడు. సాయంత్రానికి ఇంటికి బయలుదేరాడు.

మనస్సులో రైళ్ళు పరుగెత్తుచున్నట్లుగా వుంది. బ్రతుకే భారమై పోయింది గదా అనుకొన్నాడు. 100 మైళ్ళ దూరంలో నున్న గ్రామానికి భార్యాపిల్లలతో చేతిలో చిల్లిగవ్వలేని నేను ఎట్లా పోయేది. ఎట్లా పోగలను. అనుకుంటూ కాళ్ళను రోడ్డు మీద ఈడుస్తున్నాడు. దారిలో పేపర్లో "విశాఖపట్టణంలో ఉపాధ్యాయుని ఆత్మహత్య" అన్నది చదువుకొని తనకంటె అతడు ఎన్నోరెట్లు గొప్పవాడు. ధన్యుడు. అనుకొంటూ ఇల్లు చేరాడు.

ఇంటివద్ద శాంత ఇంట్లో మిగిలి ఉన్న అరసోలెడు బియ్యం అన్నం వండి అదే పాయసంలాగా భావించి తృప్తిపడుచూ లోనికి పీక్కొనిపోయిన కండ్లతో చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. కాని రామారావు దానిని సంతోషంతో స్వీకరించలేకపోయాడు.

శాంతకు భయమేసింది. రామారావు లోనికి పోయి మంచంమీద కూలబడ్డాడు.

"ఏమిటి అలాగున్నారు?" అని భయపడుతూ శాంత అడిగింది.

"ఏముంది. ఏమీ లేదు అతడెంత ధన్యుడు." అన్నాడు రామారావు ఖిన్న హృదయంతో ఆకాశం వేపు చూస్తూ.

"ఎవరండి?"

"నాలాంటి ఒక ఉపాధ్యాయుడు. సంవత్సరాదిరోజు తన భార్యాబిడ్డలను సంతోషపెట్టలేకపోతున్నానుకదా! అని సముద్రానికి బలియైనాడు. ఎంత ధన్యుడు. అట్లాగే నేను గూడ......"

"అదేమి మాటలండి? కష్టములు కలకాలం ఉండవుగదా? ఎప్పటికైనా మంచి రోజులు వస్తవిలే!" అని అన్నది శాంత అతని మాటకు అడ్డం వచ్చి.

"మనకా, పిచ్చిదానా! ఇంకేం మంచి రోజులు. పొయ్యే రోజులు రావాల్సిందే. ప్రస్తుతానికి ట్రాన్సుఫరు వచ్చింది" అంటూ జేబులోంచి కాగితం తీసి చూపించాడు రామారావు వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

శాంత మౌనం వహించింది.

రేపు ప్రయాణానికి దమ్మిడీ లేదు. ఇంట్లో అమ్మడానికి సామాన్లు లేవు. ఎట్లా పోను. అని రామారావు వారియొక్క అధోగతిజీవితాన్ని మరల ఒకసారి భార్యముందు జ్ఞాపకంచేసి నిద్రపోయాడు.

శాంతకు నిద్రపట్టలేదు. ఆలోచించింది. మెడలో మిగిలిన మంగళసూత్రం చేతికి తగిలింది. స్త్రీకి నిజాయితీ, పాతివ్రత్యం, పతిభక్తి ముఖ్యం అనుకొన్నది. వెంటనే ఇంట్లో డబ్బాలో మిగిలిన పసుపుకొమ్ము మెడలో ధరించింది. తెల్లవారింది.

తెల్లవారగనే భర్తకు ఎదురుగా పోయి "దీనిని అమ్మి ప్రయాణానికి సిద్ధముకాండి లేకపోతే ఉద్యోగం పోతుంది" అంటూ భర్త చేతిలో తన మం-గ-ళ-సూ-త్రం ఉంచింది ఆ ఉద్యోగమునే నమ్ముకొనబట్టే ఇంతదూరం వచ్చిందని తెలుసుకొనలేని అమాయకపు శాంత.

రామారావు భార్య మాటకు "వద్దు" అని చెప్పుదామనుకొన్నాడు. కాని నోరు రాలేదు. చూస్తుండగనే కళ్ళల్లో నీరు తిరిగినై. వాటితోనే దాన్ని కడిగి పవిత్రం చేశాడు. కాని దాన్ని తీసుకొని బజారు వైపు నడవక తప్పింది కాదు. ★

భర్త: రాత్రి నాకు కాలి మీద పాముకాటు వేసినట్లు కలవచ్చిందే!

భార్య:-అయ్యోయ్యో!... ఈమూలిక దగ్గిర పెట్టుకు పడుకోండి. ఏపామూ మిమ్మల్ని కరవదు.


ఒక గంటలో యౌవ్వనము

కామస్తంభన

ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది పిరాళచెందిన వృద్ధులయిందు శక్తి, ఉత్సాహము నిచ్చును. రు 2 8.0.

మదన మంజరి ఫార్మసీ

184, గైనాబజారు రోడ్డు, మద్రాసు.

బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు పార్కురోడ్డు

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడు

వెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ- ట్రంకురోడ

ఇతర కేంద్రాల్లో ఏజెంట్లు కావాలి

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహమును, నిక్కాకక, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

సి. వి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి. నెల్లూరు జిల్లా.

కుష్ఠు ★ బొల్లి

తగ్గిరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్వాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.


# ★ సంతానం ★

(10-వ పేజీ తరువాయి)

లేరో అని ఏడవటం తప్పితే ఏముంది చెప్పండి. అంతో మన ఖర్మ తప్ప ఇంకేమీ లేదు. పాపం శాంతమ్మగారికి ఎంతమంది వున్నా ఏం చేశారో చూడండి ఆమెను. ఏదో వుద్ధరిస్తారనుకుంటాం గాని తీరా వాండ్లవల్ల కలిగే సుఖానికన్నా దుఃఖమే ఎక్కువ కనబడ్డది. ఎన్నడో జరగబొయ్యే దానికని ఇప్పట్నుంచీ ఏడవటం ఎంత తప్పో యిప్పటికన్నా తెలిసివచ్చిందాండీ. ఇన్నాళ్ళూ పిల్లలు లేరే అని అఘోరించడం ఎంతో తప్పయింది అసలు మన బంధువులంతా మనకు పిల్లలు లేరని గాదండీ విచారించడం. వీళ్లకు పిల్లలు లేరే వీండ్లు హాయిగా వుంటున్నారే, వీండ్లకు కష్టాలు లేవే అని లోలోపల అసూయపడుతూ పైకిమాత్రం మనకేదో కొరతవున్నట్లు చూపించి మనలను ఏడిపించటం తప్ప. అంతే నంటారా' అన్నది కమల.

'అంతే కమలా, నిజంగా అంతే. యీ అఘోరించేవాండ్లే రేపాకవేళ మనకే గనక పిల్లలు పుడితే యింకా అఘోరిస్తారనుకో' అన్నాడు రామం.

'నిజంగానే?' అన్నది కమల.

'చూస్తావుగా' అన్నాడు రామం. ★